క్లుప్తంగా

అన్న ప్రసాద వితరణ

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాల ముగింపులో భాగంగా శుక్రవారం అన్న ప్రసాద వితరణ చేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి దుళ్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం ఆలయ అర్చకుడు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో చక్రస్నానం నిర్వహించారు.

విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



పట్టపగలు వెంకట్రావును సత్కరిస్తున్న సూర్యారావు, జితేంద్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి అసోసియేషన్ కృషి చేస్తోందని అధ్యక్షుడు కోరాడ సూర్యారావు అన్నారు. వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్లో శుక్రవారం జిల్లా విశ్రాంత రెవెన్యూ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి సంఘ గౌరవాధ్యక్షుడు, విశ్రాంత జిల్లా రెవెన్యూ అధికారి మారిశెట్టి జితేంద్ర అధ్యక్షత వహించారు. సూర్యారావు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి పేరున అసోసియేషన్ ఉండేదన్నారు. దీనిలోని రాజమండ్రి, కొవ్వూరు డివిజన్లను కలిపి కొత్తగా తూర్పుగోదావరి జిల్లా విశ్రాంత రెవెన్యూ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు. సమాజంలో సేవచేసే విశిష్ట వ్యక్తులను ఏటా సంఘం తరఫున సన్మానించాలని తీర్మానించామన్నారు. దీనిలో భాగంగా రోటరీ కైలాస భూమి నిర్వాహకుడు, మహాకాళేశ్వరాలయం దేవాలయ నిర్మాత పట్టపగలు వెంకట్రావును సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు సాయితాతారావు, కార్యదర్శి తేజో భాస్కరరావు, కోశాధికారి ఏఎల్ నారాయణరావు పాల్గొన్నారు.


ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడి



సభలో మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ వర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులపై ఒత్తిడి తీవ్రంగా పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం నగర శాఖ అభిప్రాయ పడింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తక్షణం ప్రభుత్వం.. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని తీర్మానించింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక చందా సత్రంలోని పార్వతీ పరమేశ్వర కల్యాణ మంటపంలో రాజమహేంద్రవరం నగర శాఖ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభ జరిగింది. దీనికి నగర శాఖ అధ్యక్షుడు జీబీ విజయ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లింపునకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని, ప్రభుత్వ హామీలను అమలు చేయాలన్నారు. విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే హైకోర్టు జడ్జితో పీఆర్‌సీ కమిషన్ నియమించాలన్నారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులతో సెలవు రోజుల్లో కూడా నిర్బంధంగా సర్వేలు చేయించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ చాంబుర్లీన్ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం పోరాడుతున్నామని, ఉద్యోగులు సహకరించాలని కోరారు. నగర కార్యదర్శి బి.నాగేశ్వరరావు, వుమెన్స్ వింగ్ నాయకురాలు, నగర ఉపాధ్యక్షురాలు పి.అంజలిశ్రీ మాట్లాడారు.

సినిమాలు



శ్యామల	:	దిల్ రుబా
సూర్యమినీ	:	మికీ 17, శివంగి
సూర్యప్యాలెస్	:	దిల్ రుబా
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	ఆఫీసర్ ఆన్ డ్యూటీ
అనుశ్రీ	:	శబ్దం
రాజా	:	అగత్యా
ఊర్వశి	:	తండేల్
మేనక	:	1000 వాలా, సంక్రాంతికి వస్తున్నాం
రంభ	:	మజాకా
కుమారి	:	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర	:	యుగానికి ఒక్కడు
అశోక	:	చావా
నామవరం		
వీఎస్ మహల్	:	దిల్‌రుబా
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	చావా, కోర్ట్
కడియం		
వెంకటసూర్య	:	కోర్ట్

నిత్యం సైక్లింగ్.. ఆరోగ్యానికి కింగ్



- సైకిల్ తొక్కితే సంపూర్ణ ఆరోగ్యం
- అరగంట వ్యాయామంతో వ్యాధులు దూరం
- ఆసక్తి చూపుతున్న యువత, పెద్దలు

ప్రకాశం నగర్: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. అప్పుడే ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. పూర్వ కాలంలో ప్రతి ఒక్కరూ కష్టించి పనిచేసేవారు. శరీరం ఆరోగ్యంగా ఉండేది. అయితే మారిన జీవన పరిస్థితుల నేపథ్యంలో ఆధునిక మానవులకు శారీరక శ్రమ తగ్గిపోయింది. ఇంట్లోనూ, బయటా ప్రతి పనికీ యంత్రాలు వచ్చేశాయి. వీటి వల్ల పని తొందరగా జరుగుతున్నప్పటికీ శారీరక శ్రమ ఉండడం లేదు. దీంతో 30 ఏళ్ల నిండకుండానే రోగాలు దాడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. వాటిలో సైక్లింగ్ మంచిదని చెబుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ చేస్తూ అనేక మంది కనిపిస్తారు. మరికొందరు యోగా తరగతులు, వ్యాయామశాలలకు వెళతారు. వాకింగ్‌తో పోలిస్తే సైక్లింగ్‌తోనే ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని పలువురు చెబుతున్నారు. ఒక నిమిషం సైక్లింగ్‌తో శరీరంలో 12 క్యాలరీల శక్తి ఖర్చు అవుతుందని, పర్యావరణ హితంతో పాటు శరీరంలోని కొవ్వును కరిగించి అధిక బరువు సమస్యను కూడా తొలగిస్తుందని అంటున్నారు. ప్రతి రోజూ అరగంట సైకిల్ తొక్కడం వల్ల శారీరక ధృడత్వంతో పాటు రోగనిరోధకశక్తి పెరుగుతుంది.

మారిన జీవన విధానం

గతంలో సైకిల్ అంటే గుర్తుకు వచ్చే పేరు హీరో సైకిల్. మారిన జీవన విధానంలో భాగంగా స్కూటర్లు, బైక్‌లు, కార్లు అందుబాటులోకి వచ్చినప్పటికీ సైకిల్‌కు ఉన్న ప్రాధాన్యత తగ్గలేదు. ప్రసుత్తం యువత, చిన్నారుల అభిరుచికి తగ్గట్టుగా వివిధ రకాల గేర్ల సైకిళ్లు అనేక మోడళ్లలో అందుబాటులోకి వచ్చాయి. వీటిని వినియోగించేందుకు అందరూ ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు మార్కెట్‌లోకి ఎలక్ట్రిక్ సైకిళ్లు సైతం అందుబాటులోకి వచ్చాయి.

స్థూలకాయంతో సమస్యలు

మారిన ఆహారపు అలవాట్ల కారణంగా జనాభాలో అధిక శాతం స్థూలకాయంతో బాధపడుతున్నారు.



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల సైకిళ్లు

ముఖ్యంగా చిన్నారులు, యువతీ యువకులు అధిక బరువుతో అవస్థలు పడుతున్నారు. ఫాస్ట్ ఫుడ్, కేక్‌లు, పిజ్జా, బర్గర్లు తదితర జంక్ ఫుడ్ అధికంగా తినడం వల్ల స్థూలకాయం బారిన పడుతున్నారు. ఇలాంటి వారందరికీ సైక్లింగ్ మంచి వ్యాయామంగా మారింది. టెక్నాలజీ పెరిగిన తర్వాత ట్రెడ్ మిల్, ఎక్సర్ సైజ్ బైక్ తదితర పలు రకాల వ్యాయామ సాధనాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో సైకిళ్ల తొక్కడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. ప్రతి రోజూ సైకిల్ తొక్కడం వల్ల గుండె జబ్బులు, హార్ట్ స్ట్రోక్ వంటి ప్రమాదాలు బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన పెరిగింది



కరోనా తర్వాత ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. మంచి ఆహారపు అలవాట్లు చేసుకుంటున్నారు. వ్యాయామంతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది మంచి పరిణామం. ప్రతి రోజు ఒక్క గంట నడక, లేని పక్షంలో అరగంట సైక్లింగ్‌తో మంచి ఆరోగ్యం సమకూరుతుంది.

– ఏవీడీ ప్రసాదరావు, పీడీ

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆర్యాపురంలోని శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలో శుక్రవారం కృష్ణ చైతన్య మహా ప్రభువుల 538 ఆవిర్భావం, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. నాగులకొండ జేజీ నాథ స్వామి ఉమా కుమారి దంపతుల సహకారంతో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ నిర్వహించినట్లు ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నగర సంకీర్తన, స్వామి వారికి అభిషేకం, అర్చన, శృంగార హారతి జరిగింది. ఉదయం 10 గంటలకు నాగులకొండ జేజీ నాథ స్వామి ఉమా కుమారి దంపతులు హోమం నిర్వహించారు. సాయంత్రం వర్తమాన ఆచార్య భక్తికంకణ వన మహారాజ్‌చే మహా ప్రభువుల లీలా ప్రవచనం, మహా అభిషేకం, 108 రకాల పిండి వంటలతో మహారాజభోగం, హారతి, హోలీ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన రుక్మిణీ కల్యాణం



హరికథ వినిపిస్తున్న పురాణం విజయలక్ష్మి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ భాగవతారిణి పురాణం విజయలక్ష్మి గానం చేసిన రుక్మిణీ కల్యాణం హరికథ శ్రోతలను అలరించింది. త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ఆడిటోరియంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. వీరా శివప్రసాద్ వయొలిన్, కోటిపల్లి సూరిబాబు మృదంగం సహకారాలను అందించారు. సమితి గౌరవ అధ్యక్షుడు వాడ్రేవు వెంకట రమణ, చైర్మన్ చింతలూరి సుందర వెంకట రావు, ప్రధాన కార్యదర్శి జె.సరస్వతి, ఫంక్షనల్ కార్యదర్శి వక్కలంక రామచంద్రం, కార్యనిర్వాహక కార్యదర్శి వి.భాస్కర్ రామ్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. పెద్ద సంఖ్యలో సంగీతాభిమానులు పాల్గొన్నారు.

నేడు శేష గోపాలన్ గాత్రం

కార్యక్రమాల్లో భాగంగా శనివారం చెన్నైకు చెందిన మధురైకృష్ణ శేష గోపాలన్ గాత్ర కచేరీ జరుగుతుంది.

క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. హుకుంపేటలో టీడీపీ రాష్ట్ర వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా నిర్వహించిన గోరంట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ విజేతలకు శుక్రవారం సాయంత్రం ఆయన బహుమతులు అందించారు. విజేతగా నిలిచిన శాటిలైట్ సిటీ చైతూ చితాస్ జట్టుకు రూ.25 వేలు, ట్రోఫీ, రన్నర్స్‌గా నిలిచిన ధవళేశ్వరం/కడియపులంక రెడ్ రైడర్స్ సీనియర్ జట్టుకు రూ.15 వేలు, ట్రోఫీ ప్రదానం చేశారు. బెస్ట్ బౌలర్ విష్ణు, బెస్ట్ బ్యాట్స్‌మెన్ లకాన్ సింగ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఆదిత్యలకు రూ.5 వేలు, ట్రోఫీలను అందజేశారు. కడియం ఎంపీపీ వెలుగు బంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బత్తిన కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

ప్రకాశం నగర్: దివంగత మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా క్వారీ మార్కెట్ సెంటర్‌లో బత్తిన కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని బత్తిన సుబ్బారావు సేవాసమితి వ్యవస్థాపక చైర్మన్ బర్రె కొండబాబు డిమాండ్ చేశారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం సేవా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ముఖ్యసలహాదారుగా, అధికార ప్రతినిధిగా కానుబోయిన సాగర్, కార్యదర్శిగా ఎస్‌కే ఖాన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా గారా చంటిబాబు నియమితులయ్యారు. కొండబాబు మాట్లాడుతూ.బత్తిన ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో రాజమండ్రిలోని బడుగు వర్గాల ప్రజలకు ఐదు సెంట్ల భూమిని ఉచితంగా ఇళ్ల కోసం ఇచ్చారన్నారు. కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని శనివారం తొలి సేవా కార్యక్రమంగా నగరంలోని ఒక కుటుంబానికి బియ్యం, కిరాణా, కూరగాయలు, నూతన వస్త్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి బత్తిన సుబ్బారావు కుమార్తె మాటూరి లక్ష్మీచక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సమావేశంలో న్యాయవాది దారా ఆదిశేషు, శివ తోణంగి, చలపతి, రమేష్ పాల్గొన్నారు.

ఇసుకాసురుల సవాల్

- కూటమి నేతల అండదండలతో బరితెగింపు
- గోదావరిలో రేయింబవళ్లు డ్రెడ్జింగ్
- దర్జాగా ఇసుక తరలింపు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ‘దమ్ముంటే పట్టుకో షెకావత్.. పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్’ అంటూ పుష్ప సినిమాలో బాగా పాపులర్ అయిన డైలాగ్ ఇసుక అక్రమార్కులకు నూటికి నూరుపాళ్లూ సరిపోతోంది. గోదావరి నదీ గర్భాన్ని అక్రమంగా తవ్వేస్తూ.. సామాన్యులకు ఇసుక అందకుండా చేస్తూ.. అడ్డగోలుగా రూ.లక్షలు సంపాదిస్తున్నారు. గత నెల 23న జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్, కొవ్వూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంయుక్తంగా దాడులు చేశారు. వే బిల్లులు లేకుండా, సామర్థ్యానికి మించిన లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్న 8 వాహనాలను సీజ్ చేసి, రూ.5.72 లక్షల జరిమానా విధించారు.



కోటిలింగాల ర్యాంపులో ఇసుక సీజ్ చేసిన మైన్స్ అధికారులు

ఇసుకాసురులు ఆ మొత్తాన్ని చెల్లించేసి, తిరిగి యథాతథంగా ఇసుక అక్రమ రవాణాకు తెర లేపుతూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. తాజాగా కోటిలింగాల ర్యాంపుల్లో అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కోటిలింగాల ర్యాంపు చేరువగా మొత్తం ఐదు గుట్టల్లో మొత్తం 1,115 మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించి, సీజ్ చేశారు. అయితే, ఇలా అధికారులు అప్పుడప్పుడు చర్యలు తీసుకుంటున్నా.. ఇసుకాసురుల దందాకు అడ్డుకట్ట పడటం లేదు. కోర్టు కేసు కారణంగా నగరంలోని కోటిలింగాల ర్యాంపు–1లో ఇసుక తవ్వకాలకు గతంలోనే బ్రేక్ పడింది. అయితే, ఈ ర్యాంపులో 13 వరకూ ఉన్న రీచ్‌లలో ప్రతి రోజూ వందల లారీల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో రేయింబవళ్లు డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఒకవేళ అధికారులు పెద్ద మొత్తంలో పట్టుకుంటే కూటమి నాయకులు ఫోన్లు చేసి, ఒత్తిళ్లు తెస్తున్నారు. దీంతో, పట్టుకున్న లారీలను వదిలేసి, అధికారులు నిస్సహాయంగా వెనుదిరగాల్సి వస్తోంది. కోటిలింగాల ర్యాంపుల్లో అధికారులు గతంలో అనేకసార్లు బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీలను, ఇసుక డంప్‌ను పట్టుకున్నారు. కానీ, కూటమి నాయకుల ఒత్తిళ్లతో వాటిని వదిలేశారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలను సైతం ఇసుక అక్రమార్కులు పట్టించుకోవడం లేదంటే దందా ఏ స్థాయిలో కొనసాగుతోందో అర్థం చేసుకోవచ్చు.

డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్



డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల వాణిజ్య విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. మూడు రోజులు జరిగే ఈ వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్ బాబు సహకారం, మార్గదర్శకత్వం ద్వారా ఈ వర్క్‌షాప్ కార్యరూపం దాల్చిందన్నారు. డ్రోన్ టెక్నాలజీ విస్తృత అవకాశాలను పరిశీలించేందుకు అకడమియా, పరిశ్రమను ఒకచోట చేర్చడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ఏయూ ఐసీడీటీ అధ్యక్షుడు డాక్టర్ ఓఆర్ఎం రావు మాట్లాడుతూ ఐసీడీటీ అభివృద్ధి, చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు. విపత్తు నిర్వహణతో సహా అనేక రంగాల్లో డ్రోన్ సాంకేతికత వినియోగం ఆవశ్యకతను తెలిపారు. వర్క్‌షాప్‌లో బీబీఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొని డ్రోన్ల వినియోగంపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఆర్ట్స్ కళాశాల, ఐసీటీడీ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. దీనిపై ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే, ఏయూ ఐసీటీడీ అధ్యక్షుడు డాక్టర్ ఓఆర్ రావు సంతకాలు చేశారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సి.కోమల, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.ప్రతిమ, డాక్టర్ పి.సునంద, డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

కంబాలచెరువు: మహిళా చైతన్యంతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. యూటీఎఫ్, ఐద్వా, శ్రామిక మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం యూటీఎఫ్ సహాధ్యక్షురాలు ఎం.విజయ గౌరి అధ్యక్షతన సదస్సు జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు అన్ని రంగాల్లో సమానం ప్రాతినిధ్యం కల్పించినప్పుడే దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణ్ కుమారి మాట్లాడుతూ మహిళలకు సమాజం, కుటుంబం సహకారాలు అందించాలన్నారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఈ.శ్రీమణి, ఎస్.భవాని, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జరీనా, టి.తులసి, సీనియర్ నాయకులు టి.సావిత్రి, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి బేబీరాణి, ఆశా సంఘం నాయకురాలు నాగమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ తీరుపై కార్మిక సంఘాల నిరసన



శ్యామలా సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రకాశం నగర్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక శ్యామలా సెంటర్ వద్ద కేంద్ర కార్మిక సంఘాలు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐసీసీటీయూ, యువజన, విద్యార్థి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, ఏఐసీసీటీయూ నాయకుడు నల్లా రామారావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేశామని కేంద్ర ప్రభుత్వం పైకి ప్రకటనలు చేస్తూ, దొడ్డి దారిన ప్రైవేటీకరణ పనులను వేగవంతం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రకటించిన ప్యాకేజీని కార్మికుల జీతాలు చెల్లించడానికి ఉపయోగించాలన్నారు. ప్లాంట్‌లో పనిచేస్తున్న 1500 కాంట్రాక్టు కార్మికులను ఇటీవల నిలుపుదల చేశారని, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించేలా కృషి చేయాలన్నారు. ఆందోళనలో జిల్లా ఉపాధ్యక్షులు బి.పవన్, సీపీఎం కార్యవర్గ సభ్యులు జువ్వాల రాంబాబు, నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోలీ పండగ అందరిలో ఆనందం నింపాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హోలీ పండగ నగర ప్రజలందరి జీవితాలలో ఆనందం నింపాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన నగరపాలకసంస్థ అధికారులు, సిబ్బందితో కలిసి హోలీ పండగ నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలకసంస్థ గతంలో ఎన్నడూ హోలీ పండగ జరుపలేదని తెలిసిందని, దీంతో సిబ్బందితో కలిసి ఆనందోత్సవాలతో నిర్వహించామన్నారు. పారిశుధ్య సిబ్బంది ఈ వేడుకలో పాల్గొనడం ఆనందం కలిగించిందన్నారు. అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్వీ రమణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నాళం భీమరాజు వీధిలో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నాళం భీమరాజు వీధిలో గుజరాతీలు, రాజస్థానీలు హోలీ పండగను ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పెద్దఎత్తున హాజరై వారితో హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. వారికి విక్రమ్ జైన్, అనూప్ జైన్ స్వాగతం పలికారు.



పారిశుధ్య సిబ్బందితో హోలి వేడుకల్లో పాల్గొన్న నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్



మోడల్ కాలనీలో అగర్వాల్ సమాజ్ సభ్యుల సంబరాలు



రాజమహేంద్రవరంలో యువకుల సందడి

చెడుపై మంచి విజయమే హోలీ

చెడుపై మంచి విజయానికి ప్రతీకగా హోలీ పండగ జరుపుకొంటామని రాజమండ్రి అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అశోక్ కుమార్ సింగానియా తెలిపారు. స్థానిక మోడల్ కాలనీ తరణి ఎన్‌క్లేవ్ వద్ద శుక్రవారం అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. అశోక్ కుమార్ సింగినియా మాట్లాడుతూ తమ సమాజ్ ద్వారా గత 9 ఏళ్లుగా హోలీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.